సాక్షి గుంటూరు


శనివారం । 2 । సెప్టెంబర్ । 2023

I



ప్రత్యేక పూజల్లో న్యాయమూర్తి

చిలకలూరిపేట: బొప్పూడిలోని మల్లేశ్వరస్వామి, చెన్నకేశవస్వామి దేవస్థానం వద్ద శుక్రవారం నిర్వహించిన పూజల్లో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ పాల్గొన్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 523.30 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 851.70 అడుగుల వద్ద ఉంది.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శుక్రవారం 3920 క్యూసెక్కులు విడుదల చేశారు.

ప్రతి గుండెలోనూ వైఎస్సార్..

రాజన్న.. నిన్ను మరువదు ఈ గడ్డ

- పులిచింతల ఆయన హయాంలోనే..
- గుంటూరు జిల్లాపై ప్రత్యేక అభిమానం
- ఆరోగ్యశ్రీకి జిల్లాలో శ్రీకారం
- కృష్ణా పశ్చిమ డెల్టా, సాగర్ కుడి, ఎడమ కాలువల ఆధునికీకరణ
- ఆయన పాలన స్వర్ణయుగం
- నేడు వైఎస్సార్ వర్ధంతి



నమస్తే చెల్లెమ్మా.. నమస్తే అక్కయ్య.. నమస్తే తమ్ముడు.. అనే వైఎస్సార్ పిలుపు ప్రతి ఇంటా మేల్కొలుపు అయింది.. నువ్వు ఇచ్చిన ఆరోగ్యశ్రీ భరోసాతో మా ఇంటి దీపం వెలిగింది.. చదువుల కొలిమిలో నలిగిన పేదలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ రక్ష అయింది.. రైతన్నకు సాయం లేక ఉరితాడు మెడలో వేలాడే సమయంలో రుణమాఫీ ఆసరా అయింది.. వ్యవసాయం లాభసాటి చేసేందుకు.. వృథా జలాలు ఒడిసి పట్టేందుకు చేపట్టిన జలయజ్ఞం సిరుల పంట పండిస్తోంది. వైఎస్సార్ అను నేను.. అంటూ ఉచిత విద్యుత్‌పై తొలి సంతకం మా మదిలోనే ఉండిపోయింది.. నువ్వు ఎక్కడికి పోతావు రాజన్న అంటూ స్మరించుకుంటున్నారు. వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా...



2004, అక్టోబర్ 15న పులిచింతల ప్రాజెక్టు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి (ఫైల్)

సాక్షి ప్రతినిధి, గుంటూరు: రైతును రాజును చేయాలని అహర్నిశలు కలలుగన్న రైతు బాంధవుడు మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి. ఆయన హయాంలోనే రైతు సంక్షేమమే ధ్యేయంగా ముందుకు వెళ్లారు. జలయజ్ఞంలో భాగంగా పులిచింతల ప్రాజెక్టు రూపకల్పనతోపాటు ఆయకట్టు స్థిరీకరణ కోసం పాటు పడ్డారు. రైతుల బతుకు చిత్రాన్ని మార్చడం కోసం కలలు కన్నారు. నాగార్జునసాగర్ కుడి, ఎడమ కాలువల ఆధునికీకరణ కోసం 2008 ఫిబ్రవరి రెండున రూ.4,444.41 కోట్లతో నాగార్జునసాగర్ కుడి, ఎడమ కాలువల ఆధునికీకరణకు అనుమతి ఇచ్చారు. దీని ద్వారా నాగార్జునసాగర్ కుడికాలువ పరిధిలో 6.74 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరిగింది. కృష్ణా పశ్చిమ డెల్టాలో కాలువల ఆధునికీకరణ కోసం రూ. 4,573 కోట్లు కేటాయించారు. ఇందులో గుంటూరు జిల్లాకు సంబంధించి



నీటితో కళకళలాడుతున్న పులిచింతల ప్రాజెక్టు

రూ.1760.15 కోట్లను కాల్వల ఆధునికీకరణకు కేటాయించారు. ఇందులో రూ.1187 కోట్ల పనులు జరిగాయి. దీని ద్వారా జిల్లాలో 5.22 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరిగింది. మహానేత పదవి కాలంలో జిల్లా వాసులకు ఉపయోగపడే ఎన్నో ప్రాజెక్టులను ఆయన పూర్తిచేసి జిల్లా వాసుల్లో చెరగని ముద్రను వేసుకున్నారు. వైఎస్సార్ చివరి సంతకం చేసిన ఫైల్ కూడా జిల్లాలో మిర్చి రైతులకు వాతావరణ ఆధారిత బీమా కింద ప్రయోజనం చేకూర్చేదే. ఈ బీమాతో జిల్లాలో నాలుగు లక్షల మందికి పైగా రైతులు లబ్ధి పొందారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ. 12వేల కోట్ల రుణమాఫీలో జిల్లా రైతులు దాదాపు 6.7 లక్షల మందికి రూ.560 కోట్ల మేర లబ్ధి చేకూరింది. ఇందిర ప్రభ జిల్లాలో ప్రారంభించి జిల్లా రైతులకు పెద్ద పీట వేశారు. ఇందిరమ్మ ఫేజ్–2 ఇళ్లను జిల్లాలోనే ప్రారంభించారు. రాజీవ్ పల్లె బాట ద్వారా ఎన్నో గ్రామాలకు తాగునీరందించి పల్లె వాసుల మనస్సులో చెరగని ముద్ర వేశారు. గుంటూరు నగరానికి దాహార్తి తీర్చేందుకు రూ.6.50 కోట్లతో తక్కెళ్లపాడు రా వాటర్ ప్లాంట్ నుంచి తక్కెళ్లపాడు నీటి శుద్ధి వాటర్ ప్లాంట్ల వరకు రెండో పైపు లైను నిర్మించారు. నగర ప్రజల నీటి కష్టాలు తీర్చిన మహానేతను నగర ప్రజలు ఇప్పటికీ గుర్తు చేసుకుంటూనే ఉన్నారు. రూ.460 కోట్లతో ప్రపంచబ్యాంకు నిధులతో చేపట్టిన తాగునీటి పథకానికి ఆయనే అంకురార్పణ చేశారు. రైతులకు విద్యుత్ బకాయి మాఫీ చేయడం ద్వారా జిల్లాలో 80 వేల మంది రైతులకు లబ్ధి చేకూరింది. విద్యుత్ బకాయిల మాఫీ ద్వారా జిల్లాలోని రైతులకు రూ.36 కోట్ల లబ్ధి కలిగింది. ఉచిత విద్యుత్ పథకం ద్వారా జిల్లాలోని 80 వేల మంది రైతులకు ఏడాదికి రూ. 281.60 కోట్ల లబ్ధి చేకూరింది. దీంతోపాటు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. నిరుపేదల పాలిటి అపర సంజీవినిగా పేరొందిన ఆరోగ్యశ్రీ పథకాన్ని 2008లో గుంటూరు నుంచి ఆయన ప్రారంభించి జిల్లా ప్రజలకు మరిచిపోలేని విషయం. జిల్లాలో ముఖ్యమంత్రి హోదాలో డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి జిల్లాలో 57 సార్లు పర్యటించారంటే ఆయనకు జిల్లాపై మమకారం ఉందో అర్థం అవుతుంది.

పులి'చింతలు' తీర్చింది

గుంటూరు, కృష్ణా జిల్లాల ప్రజల చిర కాల స్వప్నమైన పులిచింతల ప్రాజెక్టును ఆయన అధికారంలోకి వచ్చిన కొద్దిరోజుల్లోనే 2004 అక్టోబరు 15వ తేదీన రూ.680 కోట్లతో శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంతో విజయవాడ, గుంటూరు నగరాల తాగునీటి దాహార్తి తీర్చడంతోపాటు కృష్ణా డెల్టాలో 13 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరించడానికి ఉపయోగపడుతోంది. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల్లో కూడా కృష్ణా డెల్టాకు నీటి ఇబ్బంది లేకపోవడానికి పులిచింతల ప్రాజెక్టే కారణం అనడంలో అతిశయోక్తి లేదు.

న్యూస్‌రీల్

వైద్య విధాన పరిషత్ డీసీహెచ్ఎస్‌గా డాక్టర్ సుబ్రహ్మణ్యరాజు



గుంటూరుమెడికల్: ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారిగా డాక్టర్ కె.సుబ్రహ్మణ్య రాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మార్కాపురం జిల్లా ఆసుపత్రిలో సివిల్ సర్జన్ స్పెషలిస్టుగా పనిచేస్తున్న ఆయనకు డీసీహెచ్ఎస్‌గా ప్రమోషన్ ఇచ్చి ప్రభుత్వం గుంటూరుకు బదిలీ చేసింది. రెగ్యులర్ డీసీహెచ్ఎస్‌గా పనిచేస్తున్న డాక్టర్ రత్నాకర్ సెప్టెంబరు నుంచి సెలవులో ఉండటంతో డాక్టర్ హనుమంతరావు ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇన్‌చార్జి డీసీహెచ్ఎస్‌గా పనిచేస్తున్న డాక్టర్ హనుమంతరావు నుంచి డాక్టర్ సుబ్రహ్మణ్యం రాజు బాధ్యతలు స్వీకరించారు. రెగ్యులర్ డీసీహెచ్ఎస్‌గా విధుల్లో చేరిన డాక్టర్ సుబ్రహ్మణ్య రాజుకు పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది అభినందనలు తెలిపారు.

రేపు జనవిజ్ఞాన వేదిక జిల్లా మహాసభలు

గుంటూరుఎడ్యుకేషన్: జనవిజ్ఞాన వేదిక జిల్లా మహాసభలను ఆదివారం గుంటూరు రైలుపేటలోని కన్న ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు జేవీవీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ ఏ.సత్యనారాయణ ప్రసాద్, బి.ప్రసాద్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ముఖ్య అతిథిగా పాల్గొననున్న మహాసభల్లో శాస్త్రీయ దృక్పథ ఆవశ్యకతపై సదస్సు ఉంటుందని తెలిపారు. జేవీవీ నాయకులు, సైన్స్ అభిమానులు పాల్గొనాలని కోరారు. సదస్సు అనంతరం జిల్లా నూతన కమిటీ ఎన్నిక నిర్వహిస్తామని తెలిపారు.

మొదలైన పెన్షన్ల పంపిణీ

నెహ్రూనగర్: వైఎస్సార్ పెన్షన్ కానుకను గుంటూరు జిల్లాలో శుక్రవారం లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వలంటీర్లు పెన్షన్ అందజేశారు. మొదటి రోజు జిల్లాలో 71శాతం పంపిణీ పూర్తయింది. జిల్లా వ్యాప్తంగా ఈ నెలలో 2,51,501 మంది లబ్ధిదారులు ఉండగా వారి కోసం ప్రభుత్వం రూ.69.94 కోట్లు కేటాయించింది. శుక్రవారం సాయంత్రానికి 1,79,547 మంది లబ్ధిదారులకు రూ.49.37 కోట్లు నగదు అందజేశారు.

మొదటిరోజు 26 వేల మందికి రేషన్ పంపిణీ

నరసరావుపేట: జిల్లాలోని తెలుపురంగు రేషన్‌కార్డుదారులకు ఆహార భద్రత కోసం ప్రభుత్వం ప్రతినెలా ఇచ్చే రేషన్ బియ్యం పంపిణీని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఎస్.పద్మశ్రీ శుక్రవారం పరిశీలించారు. నెలలో మొదటిరోజు సాయంత్రం ఆరు గంటలకు 26,034 మందికి ఫోర్టిఫైడ్ రైస్, పంచదార, పట్టణ వాసులకు ఫోర్టిఫైడ్ గోధుమ పండి పంపిణీ చేశారు. పట్టణ శివారు ఎస్ఆర్‌కేటీ కాలనీ, వెంగళరెడ్డికాలనీ, పనసతోట, వరవకట్ట, రావిపాడు గ్రామంలో ఎండీయూ వాహనాల ద్వారా నిర్వహిస్తున్న పంపిణీని డీఎస్ఓ పరిశీలించారు. జిల్లాలో 1289 రేషన్‌షాపుల ద్వారా 402 ఎండీయూ వాహనాలతో 6,36,405 మంది రేషన్‌కార్డుదారులకు ఈనెల 17వ తేదీలోగా పంపిణీ చేస్తామని ఆమె వెల్లడించారు.

నేడు తెలంగాణ గవర్నర్ రాక

మంగళగిరి: మండలంలోని నీరుకొండ గ్రామంలో గల ఎస్ఆర్ఎం యూనివర్సిటీ మూడవ కాన్వొకేషన్‌కు తెలంగాణ గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర్య రాజన్ హాజరుకానున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యూనివర్సిటీ ఆవరణలో జరగనున్న కార్యక్రమానికి ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ అశుతోష్ శర్మలతో పాటు యూనివర్సిటీ ఫౌండర్ ఛాన్సలర్ డాక్టర్ పీఆర్ పరివేందర్ తదితరులు పాల్గొననున్నట్లు తెలిపారు.

చెరువులో పడి చిన్నారి మృతి

కొమ్మూరు(కాకుమాను): చెరువులో పడి చిన్నారి మృతి చెందిన సంఘటన మండలంలోని కొమ్మూరులో శుక్రవారం చోటుచేసుకుంది. సేకరించిన సమాచారం మేరకు.. మండలంలోని కొమ్మూరుకు చెందిన గార్లపాడు పంచాయతీ కార్యదర్శి గుంటూరు నాగ సందీప్ కుమారుడు సాయి(3)తోటి చిన్నారులతో ఆడుకుంటూ ప్రమాదవశాత్తూ గ్రామంలో ఉన్న మంగళి చెరువులో పడి మృతి చెందాడు. గమనించిన గ్రామస్తులు చిన్నారిని బయటకు తీసే సమయానికే మృతి చెందినట్లు తెలిపారు.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.3,000, గరిష్ట ధర రూ.4,800, మోడల్ ధర రూ.4000 వరకు పలికింది.

ముగ్గురికి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు

- గుంటూరు నగరంలో ఇద్దరు, వట్టిచెరుకూరు మండలం గారపాడులో మరొకరు ఎంపిక
- గురుపూజోత్సవం రోజున పురస్కార ప్రదానం



నర్రా ఉషాకుమారి, శ్రీశారదానికేతన్



ఎద్దుల అనిల్‌కుమార్, ఆర్సీఎం యూపీ

గుంటూరుఎడ్యుకేషన్: మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ప్రభుత్వం శుక్రవారం ప్రకటించిన రాష్ట్రస్థాయి ఉత్తమ పురస్కారాలకు గుంటూరు జిల్లా నుంచి ముగ్గురు ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. వారికి ఈనెల 5వ తేదీన నిర్వహించనున్న రాష్ట్రస్థాయి గురుపూజోత్సవంలో పురస్కార ప్రదానం చేయనున్నారు. గుంటూరు గనరంలోని శ్రీ శారదానికేతన్ ఓరియంటల్ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నర్రా ఉషాకుమారి, కొరిటిపాడులోని ఆర్సీఎం యూపీ స్కూల్ ఎస్జీటీ ఎద్దుల అనిల్‌కుమార్, వట్టిచెరుకూరు మండలం గారపాడులోని బీకేఆర్ జెడ్పీ హైస్కూల్లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్ తెలుగు ఉపాధ్యాయిని కె.సునీత ఎంపికయ్యారు.

విద్యాబోధనలో మేటి ఉషాకుమారి

గుంటూరు నగరం బ్రాడీపేట రెండో లైనులోని శ్రీ శారదానికేతన్ ఓరియంటల్ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నర్రా ఉషాకుమారి రాష్ట్రస్థాయి పురస్కారానికి ఎంపికయ్యారు. ఆమె స్వస్థలం వట్టిచెరుకూరు మండలం అనంతవరప్పాడు. బీఎస్సీ బీఈడీ విద్యార్హతలతో 1988లో ఉపాధ్యాయ వృత్తిలోకి ప్రవేశించారు. గతంలో ఎయిడెడ్ పాఠశాలగా ఉన్న శారదానికేతన్ పాఠశాలలో ఎస్జీటీగా ప్రవేశం పొందిన ఉషాకుమారి 1998లో స్కూల్ అసిస్టెంట్ బయాలాజికల్ సైన్స్ ఉపాధ్యాయినిగా, 2018లో ప్రధానోపాధ్యాయురాలిగా ఉద్యోగోన్నతి పొందారు. గతేడాది జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయురాలిగా పురస్కారం అందుకున్న ఉషాకుమారి తాజాగా రాష్ట్రస్థాయి పురస్కారానికి ఎంపికయ్యారు. గతంలో కేవీఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే అవార్డుతోపాటు రోటరీక్లబ్ నుంచి నేషనల్ బిల్డర్ అవార్డు అందుకున్నారు. దాతల సహకారంతో పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేశారు. గత టెన్త్ ఫలితాల్లో 93 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ప్రవేశాలు పెంచేందుకు చేసిన కృషి కారణంగా ప్రస్తుత విద్యాసంవత్సరంలో కొత్తగా 136 మంది విద్యార్థినులు ప్రవేశం పొందారు.

పాఠశాలలో ఆధునిక వసతుల కల్పనకు కృషి

కొరిటిపాడులోని ఆర్సీఎం ప్రాథమికోన్నత పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తున్న ఎద్దుల అనిల్ కుమార్ దాతల సహకారంతో ఆధునిక వసతుల కల్పనకు కృషి చేశారు. అనిల్‌కుమార్ తండ్రి వెంకటస్వామి ఫిరంగిపురంలోని సెయింట్ పాల్స్ హైస్కూల్లో పదేళ్లపాటు ఉపాధ్యాయుడిగా పనిచేశారు. అదే పాఠశాలలో చదువుకున్న అనిల్‌కుమార్ 2002లో ఉపాధ్యాయ వృత్తిలోకి ప్రవేశించారు. 2018లో ఆర్సీఎం స్కూల్లో విధుల్లో చేరినప్పటి నుంచి విద్యార్థుల ప్రవేశాలను పెంచడంలో కృషి చేశారు. 33 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలో ప్రస్తుతం 147 మంది చదువుతున్నారు. 2018 నుంచి 2021 వరకు ఇన్‌చార్జ్ హెచ్ఎంగా బాధ్యతలు నిర్వర్తించారు. పాఠశాల క్రీడా మైదాన అభివృద్ధికి స్థానిక వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ వంగల హేమలత వలివీరారెడ్డి రూ.50వేలు ఖర్చు చేశారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ అభివృద్ధితో పాటు దాతల సహకారంతో టాయిలెట్లు, డిజిటల్ క్లాస్‌రూమ్స్, పాఠశాల భవనాలకు పెయింటింగ్స్‌కు రూ.ఆరు లక్షలను వెచ్చించారు. గతేడాది జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా పురస్కారం అందుకున్నారు. సహచర ఉపాధ్యాయ మిత్రులతో కలిసి విద్యార్థులకు చేతిరాత నైపుణ్యంలో ఉచిత శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నారు.

రైతుల అభివృద్ధికి నిరంతరం కృషి

జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి

- 5వ ఏడాది తొలి విడత రైతు భరోసా నిధుల విడుదల
- జిల్లాలో 6,987 మంది ఖాతాల్లో రూ.5.24 కోట్లు జమ
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు




రైతు భరోసా చెక్కును రైతులకు అందజేస్తున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ హెనీ క్రిస్టినా

గుంటూరువెస్ట్: కౌలు రైతులను ఆదుకోవాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం క్రమం తప్పకుండా ఆర్థిక తోడ్పాటును కొనసాగిస్తుందని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి 5వ ఏడాది తొలి విడత రైతు భరోసా నిధులను బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్, ప్రజాప్రతినిధులు వర్చువల్ విధానంలో వీక్షించారు.

అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కౌలు రైతు కుటుంబాలకు ప్రభుత్వం చేస్తున్న ఆర్థిక సాయంతో వారు వడ్డీల భారం నుంచి విముక్తి పొందుతున్నారన్నారు. జిల్లాలో 6,987 మంది కౌలు రైతు కుటుంబాల ఖాతాల్లో రూ.5.24 కోట్లు జమ య్యాయని చెప్పారు. దీంతోపాటు రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను, అవసరమైన సలహాలను అందిస్తున్నామన్నారు. ఇప్పటికే సీసీఆర్సీ కార్డులను కౌలు రైతులకు అందించడంతోపాటు అధికారుల సమన్వయంతో పనిచేసి వారికి బ్యాంకు రుణాలను కూడా అందించేందుకు కృషి చేస్తున్నారన్నారు. గతంలో ఏ ప్రభుత్వం కౌలు రైతుల కోసం ఇంతలా కృషి చేయలేదని చెప్పారు. అనంతరం కలెక్టర్, జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, జీడీసీసీ బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు, కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ మండేపూడి పురుషోత్తం, జిల్లా వ్యవసాయాధికారి నున్న వెంకటేశ్వర్లు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

రైతుల గురించి పట్టించుకునే ప్రభుత్వమిది



గతంలో ఎప్పుడూ ఇంతటి ఆదరణలేదు. గ్రామాల్లోనే ఆర్బీకేల ద్వారా కల్తీలేని విత్తనాలు, పురుగుమందులు, ఎరువులు లభిస్తున్నాయి. పంట ఈ–క్రాప్ చేసుకోవాలన్నా వ్యవసాయ అసిస్టెంట్లు సాయం చేస్తున్నారు. రైతు భరోసా ద్వారా సమయానికి డబ్బులిచ్చి ఆదుకుంటున్నారు. భవిష్యత్తుపై ఆశలు కలుగుతున్నాయి...

రాఘవులు, లాల్‌పురం.

ప్రభుత్వ ఉద్యోగం బాధ్యతతో నిర్వహించాలి



గుంటూరువెస్ట్: ప్రభుత్వ ఉద్యోగమంటే కేవలం ఉపాధి కోసమే కాదని, అత్యంత బాధ్యతతో కూడుకున్నదని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఏపీపీఎస్సీ–2021లో గ్రూప్–4 ఉద్యోగాలకు ఎంపికైన 56 మందికి శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, డీఆర్వో చంద్రశేఖరరావుతో కలిసి నియామక పత్రాలు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు ఆశించే స్థాయిలో మెరుగైన సేవలందించాలన్నారు. ముఖ్యంగా వివిధ పనుల కోసం ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. ప్రభుత్వ సేవలు పొందే హక్కు ప్రజలకుందని, వాటిని అందించాల్సిన బాధ్యత మనపై ఉందనే వాస్తవాన్ని ఎప్పుడూ గుర్తుంచుకోవాలని తెలిపారు. సమావేశంలో కలెక్టరేట్ పరిపాలనాధికారి పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు గడువులోగా చేపట్టాలి

హౌసింగ్ కార్పొరేషన్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ శివప్రసాద్

నరసరావుపేట: రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన గడువు లోపల గృహ నిర్మాణాలు చేపట్టాలని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ శివప్రసాద్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్‌తో కలిసి నిర్వహించిన గృహ నిర్మాణ శాఖ సమీక్ష సమావేశంలో మాట్లాడారు. గృహ నిర్మాణాల ప్రక్రియలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. లక్ష్యసాధనలో అలసత్వం వహించవద్దని ఆయన సూచించారు. ఐహెచ్‌హెచ్ఎల్ నిర్మాణ పనులను వేగవంతం చేసి పురోగతిలోకి తీసుకురావాలన్నారు. ఏదైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద పనిదినాలను మరింత పెంపొందించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి అసిస్టెంట్ ఇంజినీరు తమ పురోగతిని తెలియజేసే విధంగా నివేదికలను సంబంధిత ఎంపీడీవోలకు ప్రతి శనివారం అందించాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ వారి సూచనలను పరిగణలోకి తీసుకొని త్వరితగతిన పనులను పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటివరకు బేస్మెంట్ లెవెల్ నుంచి ఆపై వరకు 60 శాతం పనులు పూర్తయ్యాయని బిలో బేస్మెంట్ లెవల్ పనులు 19 శాతం పూర్తయ్యాయని, యుడీఏ, యుఎల్ఆర్ పనులు 21 శాతం పూర్తయ్యాయన్నారు. ఇకపై జాతీయ ఉపాధిహామీ పథకం పనులు పెంచే విధంగా చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. మండల ప్రత్యేక అధికారులు ప్రతి బుధవారం నిర్వహించే క్షేత్రస్థాయి పరిశీలనలో హౌసింగ్ శాఖపై దృష్టి సారించి గృహ నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. మండలస్థాయిలో సమావేశాలు నిర్వహించి లబ్ధిదారులు అవగాహన కల్పించాలన్నారు. లేఅవుట్ల వద్ద సుందర ఆర్చీలు నిర్మించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. వాటి నిర్మాణానికి తీర్మానాలు చేయడం జరిగిందని, పరిపాలన అనుమతులు కూడా అందజేయడం జరిగిందన్నారు. మిగిలిన వాటికి రెండు నెలల లోపల పనులు పూర్తి చేస్తామని వివరించారు. కార్యక్రమంలో డీఆర్వో కె.వినాయకం, హౌసింగ్ శాఖ ఈఈ శివలింగం, హౌసింగ్ శాఖ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు దండమూడిలో 'మీ గుండె పదిలం' వైద్య శిబిరం

బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ



కొరిటెపాడు(గుంటూరు): బజరంగ్ జగన్నామ సంక్షేమ సంవత్సరంలో భాగంగా 'మీ గుండె పదిలం' పేరుతో చేపట్టిన గుండె వ్యాధుల నిర్ధారణ పరీక్ష శిబిరాన్ని పొన్నూరు మండలం, దండమూడి గ్రామంలో శనివారం నిర్వహిస్తున్నట్లు బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ తెలిపారు. పట్టాభిపురంలోని బజరంగ్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి సుపరిపాలనలో ఆరోగ్యశ్రీ పథకం అద్భుతంగా పని చేస్తోందన్నారు. ఇంటికే ఆరోగ్యం -జగనన్నతో సాకారం, ఆరోగ్యశ్రీతో ఆయుష్మాన్ భవ అంటూ ఈ విషయాన్ని స్వయంగా క్షేత్రస్థాయిలో ప్రచారం చేస్తూ దీనిని సద్వినియోగం చేసుకునే అవగాహనను ప్రజలకు ఆచరణాత్మకంగా బజరంగ్ ఫౌండేషన్ ఈ శిబిరాల ద్వారా కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా గత నెలలో పొన్నూరు మండలం, మామిళ్ళపల్లి, ఆరెమండ గ్రామాలలో గుండె పరీక్ష శిబిరాలను ఏర్పాటు చేసి అవసరమైన వారికి యాంజియోగ్రామ్ టెస్టులు, సమస్య నిర్ధారణ అయిన వారికి 8 స్టంట్‌లు, 4 శస్త్ర చికిత్సలను దిగ్విజయంగా పూర్తి చేసినట్లు వివరించారు. విజయవాడ మెడ్ స్టార్ ఆసుపత్రి నుంచి నిపుణులైన వైద్య బృందాలను దండమూడి గ్రామానికి రప్పించి, వారి గ్రామంలోనే ప్రత్యేక వైద్య శిబిరాన్ని, వైద్య పరీక్షలను నిర్వహించి వైద్య సేవలను అందిస్తున్నట్లు వెల్లడించారు. దండమూడి గ్రామ ప్రజలు ఈ ఉచిత వైద్య శిబిరాన్ని, వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

యార్డులో 17,251 బస్తాల మిర్చి విక్రయం


కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 15,010 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 17,251 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.9,000 నుంచి రూ.22,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.9,500 నుంచి 25,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.11,000 నుంచి రూ.22,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.13,000 నుంచి 26,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.6,000 నుంచి రూ.14,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 9,797 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

లక్ష్మీదేవి అలంకారంలో మహంకాళీ అమ్మవారి దర్శనం



తాడేపల్లి రూరల్: దుగ్గిరాల మండలం కంఠంరాజు కొండూరులో ఉన్న శ్రీ మహంకాళీ అమ్మవారి దేవస్థానంలో మూడో శ్రావణ శుక్రవారం పలు పూజల్ని నిర్వహించారు. శ్రీ మహంకాళీ అమ్మవారు లక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. దేవస్థానంలో నిర్వహించిన లక్ష్మీ పూజలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదానాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమ్మవారిని నమ్ముకున్న భక్తులకు వారి కోర్కెలను తప్పక తీరుస్తుందని తెలిపారు. ఏర్పాట్లను ఆలయ కార్య నిర్వహణాధికారి చిన వెంకటరెడ్డి పర్యవేక్షించారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు దానబోయిన వెంకటేశ్వరరావు , వైఎస్సార్ సీపీ నాయకులు నల్లనూకల కోటి యాదవ్, పిల్లి ధర్మరత్నం, జమ్ముల లోకేష్, ఉయ్యూరు మారుతి పాల్గొన్నారు.

పట్టుచీరల అలంకరణలో మెరిసిన భ్రమరాంబ



పెదకాకాని: స్థానిక భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో శ్రావణ మాసం మూడో శుక్రవారం పురస్కరించుకొని అమ్మవారిని 108 పట్టుచీరలతో ప్రత్యేకంగా అలంకరించారు. పసుపు కొమ్ములు, చందనంతో పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని, పూజల్లో పాల్గొన్నారు. ఆలయంలో భక్తిశ్రద్ధలతో పొంగలి నైవేద్యాల్ని వండి సమర్పించారు. ప్రాకార మండపంలో అన్నప్రాశనలు, నామకరణలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, పాలకవర్గం చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు, సభ్యులు ఏర్పాట్లు చేశారు. రానున్న నాలుగో శుక్రవారం లక్ష గాజులతో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయనున్నట్లు ఏసీ తెలిపారు.

శివాలయంలో సహస్ర దీపాలంకరణ సేవలు

శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని ఆలయ ప్రాకార మండపంలో సహస్ర దీపాలంకరణ సేవలు కొనసాగుతున్నాయి. ప్రతి శుక్రవారం సాయం సంధ్యలో గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఉత్సవమూర్తుల్ని అలంకరించి ఊంజల సేవతో సహస్ర దీపాలంకరణ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మేళతాళాలు, వేద మంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా అర్చకులు పూజాధికాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

శాశ్వత భూహక్కు కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం

- జాయింట్ కలెక్టర్ రాజకుమారి
- కోతివానిపాలెంలో రీ సర్వే పరిశీలన



కోతివానిపాలెంలో రైతులతో మాట్లాడుతున్న జేసీ రాజకుమారి, తహసీల్దార్ ప్రసాదరావు

కోతివానిపాలెం (కాకుమాను): రైతులకు శాశ్వత భూహక్కు పత్రాలు అందించాలన్నదే లక్ష్యమని జేసీ రాజకుమారి వెల్లడించారు. మండలంలోని కోతివానిపాలెంలో శుక్రవారం నుంచి చేపట్టిన భూముల రీ సర్వే కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ మండలంలోని గ్రామాలలో శుక్రవారం నుంచి నిర్వహిస్తున్న భూముల రీ–సర్వే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని, దీని వల్ల ఎన్నో సంవత్సరాలు భూ సమస్యలతో ఇబ్బందులు పడుతున్న అనేక మంది రైతులకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. ఎప్పుడో బ్రిటీష్ కాలంలో (సుమారు 114 సంవత్సరాల క్రితం) జరిగిన భూ సర్వేను ఎంతో ధైర్యంగా ముఖ్యమంత్రి రైతులకు మేలు చేయాలనే ధృఢ సంకల్పంతో రీ–సర్వే కార్యక్రమాన్ని తీసుకువచ్చినట్లు ఆమె తెలిపారు. రీ- సర్వే వల్ల భూహక్కుదారులు ఎవరు, ఎంత విస్తీర్ణంలో ఎంత భూమి ఉంది, ఎవరి పేరున నమోదైందని అనే పూర్తి సమాచారం పూర్తిస్థాయిలో తెలుస్తుందని జేసీ వివరించారు. మండలంలో 13 రెవెన్యూ గ్రామాలు ఉండగా తొలి విడతగా మండలంలోని కోతివానిపాలెం, కొల్లిమర్ల గ్రామాలలో రీ–సర్వే చేపట్టినట్లు ఆమె తెలిపారు. రెండు గ్రామాలలో సుమారు 6,750 ఎకరాల సాగు భూమి ఉన్నట్లు జేసీ తెలిపా రు. మండలంలోని సర్వేయర్‌లు, వీఆర్వోలు రెండు టీంలుగా ఏర్పడి వారం రోజులలో రీ సర్వేను పూర్తి చేయాలని జేసీ ఆదేశించారు. ప్రస్తుతం ఎండలు అధికంగా ఉన్నందున సమయపాలన పాటిస్తు సకాలంలో సర్వే పూర్తి చేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జె.ప్రసాదరావు, మండల సర్వేయర్ శ్రీనివాసరావు, వీఆర్వో డానియేల్, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు 101 మొబైల్ ఫోన్లు అప్పగింత



ఫోన్లను బాధితులకు అప్పగించిన జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్, ఏఎస్పీ శ్రీనివాసరావు

నగరంపాలెం: మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న 101 మందికి మరలా వాటిని గుంటూరు సైబర్ క్రైం పోలీసులు అప్పగించారు. వాటి విలువ రూ.20.50 లక్షలు ఉంటుంది. గత నెల 9న రూ.25.50 లక్షల విలువ చేసే వివిధ బ్రాండెడ్ కంపెనీల 126 మొబైల్ ఫోన్లను బాధితులకు అప్పగించిన విషయం విదితమే. ఈ క్రమంలో శుక్రవారం పలువురికి జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీవో) ఆవరణలో మొబైల్ ఫోన్లను అందజేశారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను రోజుల వ్యవధిలోనే గుర్తిస్తున్నామని చెప్పారు. ఇటీవల అమల్లోకి తీసుకొచ్చిన పోలీస్ వాట్సాప్ నంబరు 8688831574కు మంచి ఆదరణ లభిస్తోందని తెలిపారు. దీని ద్వారా బాధితులకు మెరుగైన సేవలు అందిస్తున్నామని, ఎఫ్ఐఆర్ లేకుండానే భారీగా మొబైల్ ఫోన్లను రికవరీ చేశామని పేర్కొన్నారు. కర్నాటక, తెలంగాణ, పశ్చిమ బెంగాల్, తమిళనాడు రాష్ట్రాల నుంచి ఎక్కువ మొబైల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ వాట్సాప్ నంబర్‌కు హాయ్ అని మేసేజ్ పంపిస్తే, తద్వారా పోగొట్టుకున్న ఫోన్లను సైబర్ క్రైం (ఐటీ కోర్) పోలీసులు గుర్తిస్తారని పేర్కొన్నారు. సీఈఐఆర్ సిటిజన్ పోర్టల్ ద్వారా మొబైల్‌ఫోన్లు పోగొట్టుకున్న వెంటనే పోర్టల్‌లో ఫిర్యాదు చేస్తే, వాటిలోని సమాచారం దుర్వినియోగంకాదని చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్పీలు ఎ.శ్రీనివాసరావు (క్రైం), కె.కోటేశ్వరరావు (ఏఆర్), ట్రాఫిక్ డీఎస్పీ బాలసుందరరావు, ఎస్‌బీ సీఐ శ్రీనివాస్, ఐటీ కోర్ ఎస్ఐ శ్రీనాథ్ పాల్గొన్నారు.

ముగిసిన జిల్లా అథ్లెటిక్ మీట్

గుంటూరు వెస్ట్ (క్రీడలు): అథ్లెటిక్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక బీఆర్ స్టేడియంలో జిల్లాస్థాయి అండర్–14, 16 బాల బాలికలు అండర్–18, 20 యువతీ యువకుల అథ్లెటిక్ పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుంచి సుమారు 300 మంది పాల్గొన్నారన్నారు. 100, 200 ,400, 800, 1500 పరుగు, లాంగ్ జంప్, షాట్‌పుట్, డిస్కస్ త్రో, జావెలిన్ త్రోలో పోటీలు నిర్వహించామన్నారు. జిల్లా జట్టును ఎంపిక చేసి ఈ నెల 20 నుంచి ఏలూరులో జరగనున్న రాష్ట్ర పోటీలకు పంపిస్తామని చెప్పారు. కార్యక్రమంలో కోచ్‌లు శరత్‌బాబు, సి.హెచ్.వి.రాజు, కె.రవి, జి.జె.కిషోర్, మోహన్, మీరావలి పాల్గొన్నారు

నెలాఖరు వరకు ఉచితంగా బీఎస్ఎన్ఎల్ 4జీ సిమ్

నెహ్రూనగర్: దేశవ్యాప్తంగా బీఎస్ఎన్ఎల్ 4జీ సేవల్ని రానున్న రెండు నెలల్లో ప్రవేశపెట్టబోతున్న నేపథ్యంలో 3జీ సిమ్ ఉన్న వారు కస్టమర్ సర్వీస్ సెంటర్స్‌లో ఈ నెల 30వ తేదీలోపు ఉచితంగా సిమ్‌లను పొందవచ్చని ఆ సంస్థ జనరల్ మేనేజర్ శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. 4జీ సిమ్‌గా మార్చుకున్నప్పటికీ 2జీ, 3జీ సేవల్లో ఎటువంటి అంతరాయం ఉండదని పేర్కొన్నారు. అధిక సాంకేతిక భద్రత కోసం బీఎస్ఎన్ఎల్ వినియోగదారులు గతంలో పేపర్ అప్లికేషన్ ద్వారా సిమ్ కార్డు పొందిన వారు తప్పనిసరిగా తమ ఆధార్ కార్డ్‌తో బీఎస్ఎన్ఎల్ కస్టమర్ సర్వీస్ సెంటర్‌లో కేవైసీ చేయించుకోవాలని సూచించారు. ప్రస్తుతం సిమ్ 3జీ, 4జీ సిమ్ అని తెలుసుకోవడానికి తమ మొబైల్ నుంచి సిమ్ అని టైప్ చేసి 9441299999కు మేసేజ్ పంపాలని సూచించారు. ఏదైనా సందేహాలుంటే దగ్గరలోని బీఎస్ఎన్ఎల్ కస్టమర్ సర్వీస్ సెంటర్‌లో సంప్రదించాలని తెలిపారు.

భారత్ - యూకే సంబంధాలు మరింత బలోపేతం

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల బ్రిటిష్ డెప్యూటీ హైకమిషనర్ గారెత్ విన్ ఓవెన్



గారెత్ విన్ ఓవెన్‌తో విజ్ఞాన్ యూనివర్సిటీ ప్రతినిధులు


చేబ్రోలు: భారతదేశం వేదికగా జరగబోయే జీ–20 సదస్సు ద్వారా భారత్–యూకేల మధ్య సంబంధాలు మరింత బలోపేతం కానున్నాయని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల బ్రిటిష్ డెప్యూటీ హైకమిషనర్ గారెత్ విన్ ఓవెన్ పేర్కొన్నారు. వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలోని ఆఫీస్ ఆఫ్ డీన్ ప్రమోషన్స్ కొలాబరేషన్స్ అండ్ ఫ్యాకల్టీ అఫైర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అకడమియాతో పాటు దౌత్యపరమైన అంశాల గురించి వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్‌తో ఆయన చర్చించారు. అనంతరం విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్ శ్రీకృష్ణదేవరాయలు, వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్, ఇంచార్జి రిజిస్ట్రార్ పి.ఎం.వి.రావు, డీన్లతో సమావేశమయ్యారు. గారెత్ విన్ ఓవెన్ మాట్లాడుతూ విద్య, పరిశోధనలతో పాటు సాంస్కృతిక మార్పిడి, పరస్పర సహకార అవకాశాల అన్వేషణ వంటి అంశాల గురించి చర్చించామని తెలిపారు. ఉమ్మడిగా కార్యక్రమాల్ని నిర్వహించడం ద్వారా ఇద్దరి మధ్యా భాగస్వామ్యం పటిష్టంతో పాటు విద్యాపరమైన నైపుణ్యాల్ని పెంపొందించుకోవచ్చని తెలిపారు.

గుంటూరు మీదుగా రామానందపురానికి ప్రత్యేక రైలు

లక్ష్మీపురం: దక్షిణ మధ్య రైల్వే గుంటూరు డివిజన్ రైల్వే ప్రయాణీకుల సౌకర్యార్థం సికింద్రాబాద్–రామానందపురం వయా గుంటూరు డివిజన్ మీదుగా ప్రత్యేక రైలును కేటాయించినట్లు డివిజన్ సీనియర్ డీసీఎం దినేష్‌కుమార్ శుక్రవారం తెలిపారు. రైలు నంబరు 07695 సికింద్రాబాద్–రామానంతపురం ప్రతి బుధవారం ఈనెల 6 నుంచి 27వ తేదీ వరకు కేటాయించినట్లు వెల్లడించారు. రైలు 07696 రామానంతపురం–సికింద్రాబాద్ ప్రతి శుక్రవారం ఈనెల 8 నుంచి 29వ తేదీ వరకు కేటాయించినట్లు తెలిపారు. ఈరైలు నల్గొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, బాపట్ల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు, చెన్నై ఎగ్మోర్, చెంగల్‌పట్టు, విల్లుపురం మీదుగా ప్రయాణిస్తుందని తెలిపారు.

దళిత వాడల్లో హిందూ ధర్మం విరాజిల్లాలి

ధర్మ జాగరణ మంచ్ జాతీయ నాయకులు శ్యామ్‌కుమార్



స్వామి జ్ఞానప్రసన్నగిరి ఆశీస్సులు పొందుతున్న శ్యామ్‌కుమార్

గుంటూరు వెస్ట్: దళిత వాడల్లో హిందూ ధర్మం విరాజిల్లాలని ఆర్ఎస్ఎస్ అనుబంధ సంస్థ ధర్మజాగరణ మంచ్ జాతీయ నాయకులు శ్యామ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం రాత్రి స్థానిక చుట్టుగుంట వద్ద ఉన్న అమ్మా చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు స్వామీ జ్ఞానప్రసన్నగిరిని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా శ్యామ్‌కుమార్ మాట్లాడుతూ అమాయకులైన దళితులను కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం మతం మారుస్తున్నారన్నారు. ప్రస్తుతం తిరుమల తిరుపతి దేవస్థానం దళిత వాడల్లో దేవాలయాలు నిర్మించడం, హిందూ ధర్మాన్ని ప్రచారం చేయడం నిర్వహిస్తుందని పేర్కొన్నారు. హిందూ ధర్మమంటే ఒక పవిత్రమైన విధానమని, దీనికి కుల,మతాలు వర్తింపవని చెప్పారు. కరోనాతోపాటు, అనేక క్లిష్ట సమయాల్లో అమ్మా చారిటబుల్ ట్రస్టు నిర్వహిస్తున్న కార్యక్రమాలను ఆయన కొనియాడారు. ప్రతి యుగంలో ధర్మం కోసం కొంత మంది మహనీయులు సమాజానికి అంకితమై ఉంటారని, అటువంటి వారిలో స్వామి జ్ఞానప్రసన్నగిరి ఒకరని తెలిపారు. అనంతరం స్వామి జ్ఞానప్రసన్నగిరి ఆశీర్వాదం పొందారు. శ్యామ్‌కుమార్‌ను ఆశ్రమ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ స్థానిక నాయకులు నాగార్జున, ఆశ్రమ సేవకులు పాల్గొన్నారు.

ప్రేమ పేరుతో నమ్మించి మోసం

ఆర్టీసీ బస్సు ప్రైవేటు డ్రైవర్‌పై కేసు నమోదు

ప్రత్తిపాడు: ప్రేమ పేరుతో యువతిని నమ్మించి మోసం చేసి వివాహం చేసుకున్న వ్యక్తిపై ప్రత్తిపాడు పోలీస్ స్టేషనులో కేసు నమోదైంది. ఎస్ఐ డి.రవీంద్రబాబు తెలిపిన ప్రకారం.. ప్రత్తిపాడుకు చెందిన షేక్ అస్మా స్థానికంగా పూల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఆర్టీసీ బస్సుకు ప్రైవేటు డ్రైవర్ పనిచేస్తున్న నగేష్‌తో 2022లో ఆమెకు పరిచయం ఏర్పడింది. అది ప్రేమకు దారితీసింది. అప్పటికే వివాహమైన నగేష్ ఆమెతో అబద్ధమాడాడు. తనకు ఇంకా వివాహం కాలేదని, పెళ్లి చేసుకుంటానని మాయ మాటలు చెప్పాడు. నిజమేనని నమ్మిన అస్మా ఇంట్లో కుటుంబ సభ్యులకు తన ప్రేమ విషయం చెప్పింది. దీంతో గత ఏడాది అస్మాను ఆమె కుటుంబ సభ్యులు నగేష్‌కు ఇచ్చి వివాహం చేశారు. ప్రస్తుతం వారికి ఒక కుమారుడు. వివాహమైన తొలినాళ్లలో అస్మను బాగా చూసుకున్న నగేష్ రోజులు గడిచే కొద్దీ ఇంటికి సక్రమంగా రావడం మానేశాడు. గమనించిన ఆమె నగేష్‌ను అడిగింది. దీంతో ఇద్దరి మధ్యా గొడవలు మొదలై భార్యను మానసికంగా, శారీరకంగా హింసించడం మొదలుపెట్టాడు. అనుమానంతో అస్మా నగేష్‌ను గట్టిగా నిలదీయడంతో అసలు విషయం వెలుగు చూసింది. 2014లో తనకంటే ముందుగానే వేరొక మహిళతో వివాహమైనట్లు తెలిసింది. దీంతో మోసపోయినట్లు గ్రహించిన అస్మా ప్రత్తిపాడు పోలీసు స్టేషనులో శుక్రవారం ఫిర్యాదు చేసింది. ఎస్ఐ రవీంద్రబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొనసాగిన దేహదారుఢ్య పరీక్షలు

164 మంది మహిళా ఎస్ఐ అభ్యర్థులు అర్హత



పరుగు పోటీల్లో మహిళా ఎస్ఐ అభ్యర్థులు



గుంటూరు, ప్రకాశం జిల్లాల ఎస్పీలతో మాట్లాడుతున్న రేంజ్ ఐజీ పాలరాజు

నగరంపాలెం: గుంటూరు పోలీస్ పెరేడ్‌గ్రౌండ్‌లో ఎస్ఐ మహిళా అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు శుక్రవారం జరిగాయి. 620 మంది అభ్యర్థులు హాజరవ్వగా, వారి ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. బయోమెట్రిక్, ఎత్తు, ఛాతీ, 1,600, 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్‌లు నిర్వహించారు. పరుగు పోటీలు నిర్వహించే క్రమంలో పలు సూచనలు చేశారు. గత బుధవారం నుంచి శుక్రవారం వరకు కేవలం మహిళా అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు చేపట్టారు. ఈ క్రమంలో గుంటూరు రేంజ్ ఐజీ జి.పాలరాజు, ఎస్పీలు కె.ఆరిఫ్ హఫీజ్ (గుంటూరు), మల్లికా గర్గ్ (ప్రకాశం), ఏఎస్పీలు అంకితా సూరన (ఒంగోలు), కె.సుప్రజ (గుంటూరు), హైమావతి (ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు) గ్రౌండ్‌లో పర్యటించి, ఏర్పాట్లను పర్యవేక్షించారు. 620 మంది అభ్యర్థులకు 164 మంది అర్హత సాధించారు. గ్రౌండ్‌లో మౌలిక సౌకర్యాలు నెలకొల్పారు. మహిళా పోలీస్ అధికారులతో ప్రత్యేక పహారా నిర్వహించారు. ఐజీ కార్యాలయ సీఐ సుధాకర్, పలువురు అధికార, సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి బిజినెస్
శనివారం
2-9-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	556	65,387
నిఫ్టీ ▲	182	19,435

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	14,010	▼	25
డోజోన్స్	34,782	▲	60
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,465	▲	25
డాక్స్	15,840	▼	107
షాంఘై	3,133	▲	13
నికాయ్	32,713	▲	91

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	59,489	▲	4
బంగారం (99.5 స్వచ్ఛత)	59,251	▲	4
వెండి (కిలో)	74,838	▼	193

ఫారెక్స్ రేట్లు రూ.లలో

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	81.63	83.50
£	బ్రిటన్ పౌండ్	103.01	106.40
€	యూరో	88.08	91.20
¥	జపాన్ ఎన్ (100)	55.95	57.72
AU$	ఆస్ట్రేలియా డాలర్	52.41	54.75
S$	సింగపూర్ డాలర్	60.21	62.17
SAR	సౌదీ రియాల్	21.10	22.73
UAE D	యూఏఈ దిర్హామ్	21.62	23.42
¥	చైనా యువాన్	10.28	12.35

జీఎస్‌టీ వసూళ్లు 11 శాతం అప్

ఆగస్టులో రూ.1,59,069 కోట్లు



న్యూఢిల్లీ: వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) వసూళ్లు 2023 ఆగస్టులో గత ఏడాది ఇదే నెలతో పోల్చితే 11 శాతం పెరిగి రూ.1.59 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. అధికారిక గణాంకాలను పరిశీలిస్తే..

- మొత్తం వసూళ్లు రూ.1,59,069 కోట్లు.
- సెంట్రల్ జీఎస్‌టీ వాటా రూ.28,328 కోట్లు.
- ఎస్‌జీఎస్‌టీ వసూళ్లు రూ.35,794 కోట్లు.
- ఇంటిగ్రేటెడ్ జీఎస్‌టీ రూ.83,251 కోట్లు.
- సెస్ రూ.11,696 కోట్లు.

ఆర్థిక సంవత్సరంలో తీరిది...

ఆర్థిక సంవత్సరం తొలి నెల ఏప్రిల్లో చరిత్రాత్మక స్థాయిలో రూ.1.87 లక్షల కోట్ల అత్యధిక వసూళ్లు నమోదయ్యాయి. మే, జూన్‌లో వరుసగా రూ.1.57 లక్షల కోట్లు, రూ.1.61 లక్షల కోట్లు ఒనగూరాయి.

గ్రీస్‌లో జీఎంఆర్ మరిన్ని పెట్టుబడులు



ముంబై: గ్రీస్‌లో విమానాశ్రయాన్ని అభివృద్ధి చేస్తున్న దేశీ దిగ్గజం జీఎంఆర్ గ్రూప్.. ఆ దేశంలో మరిన్ని పెట్టుబడులు పెట్టే యోచనలో ఉంది. కెలమాటా ఎయిర్‌పోర్ట్‌లో ఇన్వెస్ట్ చేసే అవకాశాలను పరిశీలిస్తోంది. ప్రస్తుతం జీఈకే టెర్నా సంస్థతో కలిసి గ్రీస్‌లోని క్రెటి ప్రాంతంలో హెరాక్లియోన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు జీఎంఆర్ గ్రూప్ తెలిపింది. హెరాక్లియోన్ విమానాశ్రయ పనులు చురుగ్గా సాగుతున్నాయని ఇంధన, అంతర్జాతీయ ఎయిర్‌పోర్ట్స్ వ్యాపార విభాగం చైర్మన్ శ్రీనివాస్ బొమ్మిడాల తెలిపారు. ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనలో భాగంగా గ్రీస్ ప్రధాన మంత్రి నిర్వహించిన విందులో శ్రీనివాస్ కూడా పాల్గొన్నారు. భారత్, గ్రీస్ మధ్య కనెక్టివిటీ మెరుగుపడితే ఇరు దేశాల స్థూల దేశీయోత్పత్తి వృద్ధికి, వ్యాపార అవకాశాల కల్పనకు తోడ్పడగలదని ఆయన పేర్కొన్నారు.

93 శాతం 2,000 నోట్లు వెనక్కు వచ్చేశాయ్: ఆర్‌బీఐ

ముంబై: ఉపసంహరణ నిర్ణయం వెలువడిన మే 19వ తేదీ నాటికి చెలామణిలో ఉన్న రూ.2,000 నోట్లలో 93 శాతం తిరిగి వచ్చేశాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ప్రకటన ఒకటి పేర్కొంది. ఆర్‌బీఐ ప్రకటన ప్రకారం, ఆగస్టు 31వ తేదీ నాటికి చెలామణిలో ఉన్న రూ.2,000 నోట్ల విలువ రూ.0.24 లక్షల కోట్లకు పడిపోయింది. బ్యాంకులకు తిరిగి వచ్చిన నోట్లలో 87 శాతం డిపాజిట్ల రూపంలో జరగ్గా, 13 శాతం బ్యాంకుల్లో ఇతర కరెన్సీలోకి మార్పిడి ద్వారా వెనక్కువచ్చాయి. అధిక విలువ నోట్లు కలిగి ఉన్న ప్రజలు 2023 సెప్టెంబరు 30 నాటికి ఆ నోట్లను డిపాజిట్ చేయాలని లేదా నిబంధనలకు అనుగుణంగా మార్చుకోవాలని ఆర్‌బీఐ సూచించింది. 2016 నవంబర్లో రూ.500, రూ.1,000 నోట్లను రద్దుచేసి కొత్త రూ.500, రూ.2,000 నోట్లను తీసుకువచ్చిన ఆర్‌బీఐ, మే 19వ తేదీన ఒక కీలక ప్రకటన చేస్తూ, రూ.2,000 నోట్లను కూడా సెప్టెంబర్ 30 నాటికి పూర్తిగా వెనక్కు తీసుకుంటున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. నిజానికి 2018–19లోనే ఆర్‌బీఐ రూ. 2,000 నోట్ల ముద్రణను నిలిపివేసింది. 2018 మార్చి 31వ తేదీ నాటికి రూ.2,000 నోట్ల గరిష్ట



చెలామణీ విలువ రూ.6.73 లక్షల కోట్లు. చెలామణీలో ఉన్న మొత్తం రూ.2,000 నోట్లలో ఈ విలువ 37.3 శాతానికి సమానం. 2023 మార్చి 31వ తేదీ నాటికి రూ.2,000 నోట్ల చెలామణీ విలువ రూ.3.62 లక్షల కోట్లు. చెలామణీలో ఉన్న మొత్తం నోట్లలో ఈ విలువ 10.8% మాత్రమే. వ్యవస్థలో 2,000 నోట్ల వినియోగం ఇంధనం, బంగారు ఆభరణాలు, కిరాణా కొనుగోళ్లకు అధికంగా వినియోగిస్తున్నట్లు ఇప్పటికే పలు సర్వేలు వెల్లడించాయి.

ఎయిర్ ఇండియా-విస్తారా విలీనానికి గ్రీన్ సిగ్నల్

కాంపిటీషన్ కమిషన్ ఆమోదముద్ర

న్యూఢిల్లీ: ఎయిర్ ఇండియా–విస్తారా విలీనబాటలో కీలక అడుగు పడింది. కొన్ని షరతులకు లోబడి ఎయిర్ ఇండియా–విస్తారా ప్రతిపాదిత విలీనాన్ని కాంపిటీషన్ కమిషన్ శుక్రవారం ఆమోదించింది. తన విమానయాన వ్యాపారాన్ని ఒకే గొడుగు కిందకు తీసుకురావడానికి సంబంధించి టాటా గ్రూప్‌కు ఇది ఒక ప్రధాన ముందడుగు. ప్లాట్‌ఫారమ్ 'ఎక్స్' పై చేసిన ఒక పోస్టింగ్‌లో విలీనానికి ఆమోదముద్ర వేసినట్లు కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) తెలిపింది. ''ఎయిరిండియాలో టాటా ఎస్ఐఏ ఎయిర్‌లైన్స్ విలీనానికి సీసీఐ ఆమోదం తెలిపింది. పార్టీలు అందించే స్వచ్ఛంద కట్టుబాట్లకు, విధి విధానాలకు లోబడి



ఎయిరిండియాలో సింగపూర్ ఎయిర్‌లైన్స్ నిర్దిష్ట వాటాలను కొనుగోలు చేస్తుంది' అని సీసీఐ పేర్కొంది. విస్తారా, ఎయిర్ ఇండియా టాటా గ్రూప్‌లో భాగంగా ఉన్న రెండు వేర్వేరు విమానయాన సంస్థలు. సింగపూర్ ఎయిర్‌లైన్స్‌కు విస్తారాలో 49% వాటా ఉంటే, టాటా సన్స్ వాటా 51%గా ఉంది. ఎయిరిండియాలో 25.1% వాటాను సింగపూర్ ఎయిర్‌లైన్స్ కొనుగోలు చేయనున్న ఒప్పందం ప్రకారం విస్తారాను ఎయిర్ ఇండియాతో విలీనం చేస్తున్నట్లు గతేడాది నవంబర్‌లో టాటా గ్రూప్ ప్రకటించింది.

ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో వార్‌బర్గ్ పింకస్ వాటా విక్రయం



న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగ ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో అమెరికన్ ప్రైవేట్ ఈక్విటీ సంస్థ వార్‌బర్గ్ పింకస్ 4.2 శాతం వాటాలను ఓపెన్ మార్కెట్ లావాదేవీ ద్వారా విక్రయించింది. వీటి విలువ రూ. 2,480 కోట్లు. బీఎస్‌ఈ డేటా ప్రకారం వార్‌బర్గ్ పింకస్ అనుబంధ సంస్థ క్లోవర్‌డెల్ ఇన్వెస్ట్‌మెంట్ 27.86 కోట్ల షేర్లను (4.2 శాతం) వాటాలను షేరు ఒక్కింటికి రూ. 89 రేటుతో విక్రయించింది. జూన్ ఆఖరు నాటి గణాంకాల ప్రకారం ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో అనుబంధ సంస్థల ద్వారా వార్‌బర్గ్ పింకస్‌కు 8.5 శాతం వాటాలు ఉన్నాయి.

ఆగస్ట్‌లో ఆల్‌టైమ్ 'రయ్'!

న్యూఢిల్లీ: దేశీయ ప్యాసింజర్ వాహన అమ్మకాలు ఆగస్టులో ఆల్‌టైం గరిష్టానికి చేరుకున్నాయి. ఎస్‌యూవీ(స్పోర్ట్ యుటిలిటీ వెహికల్స్)లకు డిమాండ్ కొనసాగడం, పండుగ సీజన్ మొదలవడంతో గిరాకీ పుంజుకుందని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. మారుతీ సుజుకీ రికార్డు స్థాయిలో అమ్మకాలు జరిపింది. మొత్తం 1,89,082 వాహనాలు విక్రయించింది. గతేడాది ఇదే నెల అమ్మకాలు 1,65,173 యూనిట్లతో పోలిస్తే 14% అధికం. హ్యుందాయ్, ఎంఅండ్ఎం, టయోటా కిర్లోస్కర్ కంపెనీలు అమ్మకాల్లో రెండంకెల వృద్ధిని సాధించాయి. టాటా మోటార్స్, హోండా కార్స్ విక్రయాల్లో స్వల్ప క్షీణత నమోదైంది. ద్విచక్ర వాహన విభాగంలో బజాజ్ ఆటో విక్రయాలు 15% తగ్గాయి. హీరో మోటో



కార్ప్, టీవీఎస్ మోటార్స్ అమ్మకాలు వరుసగా 6%, 4% పెరిగాయి. వాణిజ్య వాహనాలు, ట్రాకర్ల అమ్మకాలు కూడా గణనీయంగా పెరిగాయి.

ఆగస్ట్ వాహన అమ్మకాల తీరు..


	2023	2022	వృద్ధి(%)
మారుతీ	1,89,082	1,65,173	(+)14
హ్యుందాయ్	71,435	62,210	(+)15
టాటా మోటార్స్	78,010	78,843	(-)1
ఎండ్ అండ్ ఎం	70,350	59,049	(+)19
హోండా కార్స్	7,880	7,769	(+)1
ఎంజీ మోటార్స్	4,185	3,823	(+)9
టయోటా	22,910	14,959	(+)53
ద్విచక్ర వాహనాలు			
బజాజ్ ఆటో	3,41,648	4,01,595	(-)15
హీరో మోటో	4,88,717	4,62,608	(+)6
టీవీఎస్	3,45,848	3,33,787	(+)4
రాయల్ ఎన్‌ఫీల్డ్	77,583	70,112	(+)11
వాణిజ్య వాహనాలు			
వోల్వో ఐషర్	6,476	5,003	(+)29
అశోక్ లేలాండ్	15,576	14,121	(+)10
ట్రాక్టర్లు			
ఎస్కార్ట్స్	5,198	5,308	(+)2
మహీంద్రా	21,676	21,520	(+)1

కోవర్టు లాబీయింగ్ చేశాయి

- పర్యావరణ చట్టాలను అనుకూలంగా మార్చుకున్నాయి
- అనిల్ అగర్వాల్ సంస్థలను టార్గెట్ చేసిన ఓసీసీఆర్‌పీ
- వేదాంత, కెయిర్న్‌పై ఆరోపణలు

న్యూఢిల్లీ: అదానీ గ్రూప్ ప్రమోటర్లపై ఆరోపణలు గుప్పించిన ఓసీసీఆర్‌పీ తాజాగా పారిశ్రామిక దిగ్గజం అనిల్ అగర్వాల్‌కి చెందిన కంపెనీలు వేదాంత, కెయిర్న్ ఇండియాను టార్గెట్ చేసింది. పర్యావరణ చట్టాలను అనుకూలంగా మార్చుకునేందుకు వేదాంత కోవర్టు లాబీయింగ్ నడిపినట్లు కొత్తగా మరో నివేదికలో ఆరోపించింది. ప్రభుత్వం కూడా ప్రజలను సంప్రదించకుండా నిబంధనల మార్పులను ఆమోదించి, 'అక్రమ పద్ధతుల్లో' అమలు చేసినట్లు పేర్కొంది. ఆర్గనైజ్డ్ క్రైమ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్టు (ఓసీసీఆర్‌పీ) విడుదల చేసిన నివేదికలోని కొన్ని ప్రధానాంశాలు..

- కొత్తగా పర్యావరణ అనుమతుల అవసరం లేకుండా దేశీయంగా ఉత్పత్తిని 50% వరకు పెంచుకునేందుకు మైనింగ్ కంపెనీలకు అనుమతినిస్తే ఆర్థిక వ్యవస్థ రికవరీ మరింత వేగవంతం కాగలదని 2021 జనవరిలో వేదాంత గ్రూప్ చైర్మన్ అనిల్ అగర్వాల్ అప్పటి పర్యావరణ శాఖ మంత్రి ప్రకాష్ జవదేకర్‌కు లేఖ రాశారు.
- ''2022 తొలినాళ్లలో పలు దఫాల సమావేశాల అనంతరం పర్యావరణ శాఖ నిబంధనలను సడలించింది. ప్రజాభిప్రాయాల సేకరణ నిర్వహించాల్సిన అవసరం లేకుండా మైనింగ్ కంపెనీలు



50 శాతం వరకు ఉత్పత్తిని పెంచుకునేందుకు అనుమతించింది'' అని ఓసీసీఆర్‌పీ తెలిపింది.

- వేదాంత తరహాలోనే దాని అనుబంధ సంస్థ కెయిర్న్ ఆయిల్ అండ్ గ్యాస్ కూడా వ్యవహరించింది. చమురు అన్వేషణ ప్రాజెక్టుల కోసం ప్రజాభిప్రాయ సేకరణ నిబంధనను ఎత్తివేసేందుకు లాబీయింగ్ చేసింది.
- అధికార బీజేపీకి వేదాంత గణనీయంగా విరాళాలు కూడా ఇచ్చినట్లు (2016–2020 మధ్య కాలంలో రూ.43.5 కోట్లు) ఆధారాలు ఉన్నాయని ఓసీసీఆర్‌పీ తెలిపింది.

వేదాంత స్పందన ఇదీ..

ఓసీసీఆర్‌పీ ఆరోపణలను నిర్ద్వంద్వంగా ఖండించకుండా వేదాంత స్పందించింది. 'దిగుమతులకు ప్రత్యామ్నాయంగా పర్యావరణానికి అనుకూలమైన విధానాల్లో దేశీయంగా ఉత్పత్తిని పెంచాలనేది మా లక్ష్యం. దానికి అనుగుణంగా దేశాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని, సహజ వనరుల విషయంలో భారత్ స్వావలంబన సాధించడంలో తోడ్పాటు అందించే ఉద్దేశంతో ప్రభుత్వ పరిశీలన కోసం పలు విజ్ఞప్తులు చేశాము' అని సంస్థ అధికార ప్రతినిధి తెలిపారు.

రెండు నెలల్లో అతిపెద్ద లాభం

- మెప్పించిన స్థూల ఆర్థిక గణాంకాలు
- సెన్సెక్స్ లాభం 556 పాయింట్లు
- 19,400 స్థాయి పైకి నిఫ్టీ

ముంబై: స్థూల ఆర్థిక గణాంకాలు మెప్పించడంతో పాటు ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని సానుకూల సంకేతాలు కలిసిరావడంతో శుక్రవారం స్టాక్ సూచీలు ఒక శాతం మేర ర్యాలీ చేశాయి. సెన్సెక్స్ 556 పాయింట్లు పెరిగి 65,387 వద్ద నిలిచింది. నిఫ్టీ 182 పాయింట్లు బలపడి 19,435 వద్ద స్థిరపడింది. వెరసి గడిచిన రెండు నెలల్లో అతిపెద్ద లాభాన్ని గడించాయి. ట్రేడింగ్ ప్రారంభం నుంచీ ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు మొగ్గుచూపారు. ఫార్మా మినహా అన్ని రంగాల షేర్లూ రాణించాయి. ఒక దశలో సెన్సెక్స్ 642 పాయింట్లు దూసుకెళ్లి 65,473 వద్ద, నిఫ్టీ 205 పాయింట్లు ఎగసి 19,459 వద్ద ఇంట్రాడే గరిష్టాలను నమోదు చేశాయి. మెటల్, ఆయిల్‌అండ్‌గ్యాస్, బ్యాంకింగ్, ఫైనాన్స్ షేర్లు రాణించి సూచీల ర్యాలీకి ప్రాతినిధ్యం వహించాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.488 కోట్లు, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.2,295 కోట్ల ఈక్విటీలు కొన్నారు. ఈ వారం మొత్తంగా సెన్సెక్స్ 500 పాయింట్లు, నిఫ్టీ 169 పాయింట్లు లాభపడ్డాయి. కాగా, సెన్సెక్స్ భారీ ర్యాలీతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.312.33 లక్షల కోట్లు ఎగబాకింది.



సాక్షి స్పోర్ట్స్

అంతర్జాతీయ క్రికెట్ ఆడనున్న తొలి 'ట్రాన్స్‌జెండర్'గా డానిల్ మెక్‌గహే

అంతర్జాతీయ క్రికెట్‌లో తొలి 'ట్రాన్స్‌జెండర్' బరిలోకి దిగనుంది. లింగ మార్పిడి చేసుకున్న కెనడాకు చెందిన 29 ఏళ్ల డానిల్ మెక్‌గహే ఇప్పుడు మహిళల జట్టు తరఫున క్రికెట్ ఆడుతుంది. అమెరికన్ క్వాలిఫయర్ టోర్నీలో పాల్గొనే కెనడా టి20 జట్టులో ఆమెకు చోటు లభించింది. ఆస్ట్రేలియాలో పుట్టిన ఆమె కెనడాకు వలస వచ్చింది. 2020లో పురుషుడి నుంచి స్త్రీగా మారేందుకు సిద్ధమైన ఆమె 2021లో వైద్యపరంగా పూర్తి స్థాయిలో మహిళగా మారింది. ట్రాన్స్‌జెండర్‌లు అంతర్జాతీయ మ్యాచ్ ఆడేందుకు ఐసీసీ నిర్దేశించిన అర్హత ప్రమాణాలను ఆమె ఇటీవలే అందుకుంది. 'ట్రాన్స్‌జెండర్‌ను మహిళగా గుర్తించాలంటే వరుసగా 12 నెలల పాటు టెస్టోస్టిరాన్ లెవల్ 5 నానోమోల్/లీటర్‌కంటే తక్కువగా ఉండాలి' అనేది ఐసీసీ నిబంధన.



నీరజ్‌కు రెండో స్థానం

జ్యూరిచ్ డైమండ్ లీగ్ మీట్

జ్యూరిచ్ (స్విట్జర్లాండ్): భారత స్టార్ అథ్లెట్, వరల్డ్ చాంపియన్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా ప్రతిష్టాత్మక డైమండ్ లీగ్ మీట్‌లో కాస్త తడబడ్డాడు. ఈ సీజన్ లీగ్ నాలుగో మీట్ బరిలోకి దిగిన నీరజ్ రెండో స్థానంతో సరి పెట్టుకున్నాడు. జ్యూరిచ్‌లో జరిగిన ఈ పోటీల్లో నీరజ్ 85.71 మీటర్ల దూరం జావెలిన్ విసిరాడు. ఈ ఈవెంట్‌లో జాకబ్ వాల్డెచ్ (చెక్ రిపబ్లిక్ – 85.86 మీటర్లు) అగ్రస్థానం సాధించగా... జూలియన్ వెబర్ (జర్మనీ – 85.04 మీటర్లు) మూడో స్థానంలో నిలిచాడు. నీరజ్ విసిరిన ఆరు త్రో లలో 80.79 మీ., 85.22 మీ., 85.71 మీ. దూరాలు నమోదు చేయగా మరో మూడు త్రో లు 'ఫౌల్' అయ్యాయి. అయితే మూడు మీట్‌లలో కలిపి 23 పాయింట్లు సాధించడం ద్వారా మూడో స్థానంతో డైమండ్ లీగ్ ఫైనల్ చాంపియన్‌షిప్‌కు నీరజ్ అర్హత సాధించాడు. గత ఏడాది డైమండ్ లీగ్ చాంపియన్ అయిన నీరజ్...ఈ సీజన్‌లో దోహా, లాసానేలలో అగ్రస్థానం సాధించాడు. గాయం కారణంగా అతను మొనాకో మీట్‌లో పాల్గొనలేకపోయాడు. సెప్టెంబర్ 17నుంచి యూజీన్ (అమెరికా)లో ఫైనల్స్ జరుగుతుంది. ఇతర ఫలితాల్లో లాంగ్‌జంప్‌లో మురళీ శంకర్ ఐదో స్థానంలో నిలిచాడు. అతనూ ఫైనల్స్‌కు అర్హత సాధిండంలో సఫలమయ్యాడు.

జ్యూరిచ్‌లో తన ప్రదర్శన పట్ల నీరజ్ సంతృప్తి వ్యక్తం చేశాడు. వరల్డ్ చాంపియన్‌షిప్ తర్వాత తాను బాగా అలసిపోయానని, కాస్త భుజం నొప్పి కూడా ఇబ్బంది పెట్టిందని నీరజ్ వ్యాఖ్యానించాడు. ఫైనల్స్ సమయానికి తాను 100 శాతం ఫిట్‌గా ఉండాలని కోరుకుంటున్నట్లు అతను చెప్పాడు. పారిస్ ఒలింపిక్స్‌లో స్వర్ణం నిలబెట్టుకోవడం కూడా తన లక్ష్యమని నీరజ్ వెల్లడించాడు.



నేడే 'ఆసియా' అసలు సమరం

భారత్, పాక్ ఢీకి సిద్ధం

- ఫేవరెట్‌గా రోహిత్ సేన
- నంబర్‌వన్ హోదాతో బాబర్ బృందం
- మ్యాచ్‌కు వానగండం
- మ.గం. 3 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

పల్లెకెలె: వన్డే ప్రపంచకప్‌కు ఇంకొన్ని రోజులే ఉంది. మెగా ఈవెంట్‌కు ముందు క్రికెట్ ప్రపంచం ఒళ్లంతా కళ్లు చేసుకునే కీలక మ్యాచ్ నేడు జరుగనుంది. చిరకాల ప్రత్యర్థులు భారత్, పాకిస్తాన్ జట్లు సై అంటే సై అనే పోరుకు ఆసియా కప్ వన్డే టోర్నీ వేదికైంది. నంబర్‌వన్ పాక్, ఆసియా కప్ ఫేవరెట్ భారత్ మధ్య జరగబోయే ఈ పోరు టోర్నీకే హైలైట్‌గా నిలవడం ఈపాటికే ఖాయమైంది. కేవలం వన్డే ఫార్మాట్‌నే చూసుకుంటే గత వన్డే ప్రపంచకప్ తర్వాత ఇరు జట్లు తలపడే 50 ఓవర్ల పోటీ ఇదే! గతేడాది జరిగిన టి20 వరల్డ్‌కప్‌లో విరాట్ అద్భుత ప్రదర్శన తర్వాత ఇరు జట్లు ఇప్పుడు తలపడుతున్నాయి. మెల్‌బోర్న్ తరహాలో లంక గడ్డపై కూడా మరో హోరాహోరీ ఖాయం.

కొత్త ఉత్సాహంతో రోహిత్ బృందం

గత కొన్నాళ్లుగా స్వదేశంలో జరిగే ప్రపంచకప్ కోసం భారత్ చాలా ప్రయోగాలు చేసింది. రాహుల్, అయ్యర్, బుమ్రావంటి కీలక ఆటగాళ్ల గాయాల నేపథ్యంలో భారత టీమ్ మేనేజ్‌మెంట్ తగిన జాగ్రత్తలు తీసుకొని సీనియర్లు రోహిత్, కోహ్లిలకు బాగా విశ్రాంతినిస్తూ కాపాడుకుంటూ వచ్చింది. ఇక సమయం, సందర్భం రావడంతో టీమిండియా తురుపుముక్కలు బరిలోకి దిగుతున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఇది కచ్చితంగా 'ప్రి ప్రపంచకప్' పోటీనే! ఇందులో ఏ సందేహం లేదు. దాదాపు వరల్డ్‌కప్‌లో బరిలోకి దిగే


ఆసియా కప్ ట్రోఫీతో గత ఏడాది (2022) భారత, పాకిస్తాన్ కెప్టెన్లు రోహిత్ శర్మ, బాబర్ ఆజమ్ (ఫైల్)

జట్టును ఖాయం చేసేందుకు ఈ ఆసియా టోర్నీని జట్టు వాడుకుంటోంది. రోహిత్, కోహ్లిల ఫిట్‌నెస్, జట్టులోకి అనుభవజ్ఞుడైన ఆల్‌రౌండర్ జడేజా పునరాగమనం, మరో ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా, బౌలింగ్ దళపతి బుమ్రా, 'హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్' సిరాజ్ ఇలా చెప్పుకుంటూ పోతే భారత్ పూర్తి స్థాయి ప్రపంచకప్ సైన్యంతో రంగంలోకి దిగుతోంది. దీన్నిబట్టి చూస్తే పాక్ పనిపట్టేందుకు, ఆసియా కప్‌లో ఓడించేందుకు రోహిత్ సేనకు ఏమంత కష్టం కానేకాదు.

పుంజుకున్న బలంతో పాక్

కొంత కాలంగా ఇంటాబయటా నిలకడైన విజయాలు, గట్టి ప్రత్యర్థులను ఓడించిన తీరుతో బాబర్ ఆజమ్ సేన మునుపటి కంటే పుంజుకుంది. బ్యాటింగ్‌లో ఫఖర్–ఇమామ్ ఓపెనింగ్ జోడీ నుంచి ఏడో నంబర్ షాదాబ్ ఖాన్ వరకు బ్యాటింగ్ చేసే సత్తా పాకిస్తాన్ పటిష్టంగా నిలుపుతోంది. బౌలింగ్‌లో పేస్ త్రయం షాహిన్ అఫ్రిది, నసీమ్ షా, రవూఫ్ ఆరంభంలో వికెట్లు పడగొట్టడంతో సఫలమవుతున్నారు. స్పిన్‌లో షాదాబ్, నవాజ్ సత్తా చాటుతుండటంతో పాకిస్తాన్ భారత్‌కు దీటుగా ఉంది. నంబర్‌వన్ హోదా అదనపు స్థైర్యాన్ని తెచ్చిపెట్టగా... రెట్టించిన ఉత్సాహంతో ప్రత్యర్థిని ఢీకొనేందుకు రెడీగా ఉంది.

గత ఐదు వన్డేల్లో...

భారత్, పాక్‌లు తలపడిన గత ఐదు వన్డేల్లో టీమిండియాదే 4–1తో పైచేయిగా ఉంది. 2017 చాంపియన్స్‌ట్రోఫీలో లీగ్ దశలో గెలిచి తుదిపోరులో భారత్ ఓడింది. 2018 ఆసియాకప్‌లో రెండుసార్లు టీమిండియా గెలిచింది. చివరిసారిగా గత వన్డే ప్రపంచకప్(2019)లోనూ భారత్‌దే గెలుపు.

పిచ్-వాతావరణం

ఇది కొత్త పిచ్. పక్కాగా దీనికే అనుకూలమని చెప్పలేం. లంక, బంగ్లా మధ్య జరిగినట్లే సీమర్లు, స్పిన్నర్లకు చక్కని చాన్స్! అయితే మ్యాచ్‌కు వాన ముప్పు పొంచివుంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వాన కురిసే అవకాశముండటంతో మ్యాచ్ మొదలయ్యేందుకు ఆలస్యం కావొచ్చు.

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), శుబ్‌మన్, కోహ్లి, అయ్యర్, ఇషాన్ కిషన్, హార్దిక్ పాండ్యా, జడేజా, శార్దుల్ /షమీ, కుల్దీప్, సిరాజ్, బుమ్రా.

పాకిస్తాన్: బాబర్ ఆజమ్ (కెప్టెన్), ఫఖర్ జమాన్, ఇమామ్ ఉల్ హక్, రిజ్వాన్, ఆగా సల్మాన్, ఇఫ్తికార్, షాదాబ్‌ఖాన్, నవాజ్, షాహిన్ షా అఫ్రిది, నసీమ్ షా, రవూఫ్.


మైదానంలో విరాట్ కోహ్లి, రవూఫ్ ముచ్చట్లు

'విషీ'ని దాటిన గుకేశ్

- 'ఫిడే' ర్యాంకింగ్స్‌లో భారత్ తరఫున నంబర్‌వన్
- 37 ఏళ్ల తర్వాత అగ్రస్థానం కోల్పోయిన ఆనంద్



చెన్నై: 1986 జులై 1... చదరంగ మేధావి విశ్వనాథన్ ఆనంద్ భారత నంబర్‌వన్ ఆటగాడిగా మొదటిసారి గుర్తింపు తెచ్చుకున్న రోజు. నాటినుంచి ఇప్పటి వరకు అతనిదే అగ్ర స్థానం. అతని తర్వాత భారత్‌నుంచి పెద్ద సంఖ్యలో కుర్రాళ్లు సత్తా చాటుతూ వచ్చినా... వారితో పోటీ పడుతూ సత్తా చాటిన ఆనంద్ 37 సంవత్సరాలుగా 'టాప్'లోనే నిలిచాడు. ఒక తరం పాటు ఆటను శాసించి ఎందరికో స్ఫూర్తిగా నిలిచిన ఆనంద్ ఇప్పుడు తొలిసారి తన భారత నంబర్‌వన్ స్థానాన్ని కోల్పోయాడు. 17 ఏళ్ల దొమ్మరాజు గుకేశ్ ఇప్పుడు టాప్ ర్యాంక్‌లోకి వచ్చాడు. అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) శుక్రవారం అధికారికంగా ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ప్రకటించింది. ఇందులో గుకేశ్ 8వ ర్యాంక్‌లో నిలవగా... విశ్వనాథన్ ఆనంద్ 9వ ర్యాంక్‌లో ఉన్నాడు. గుకేశ్ రేటింగ్ 2758 కాగా, ఆనంద్ రేటింగ్ 2754గా ఉంది. ఇటీవల జరిగిన వరల్డ్ కప్ సమయంలోనే 'లైవ్ రేటింగ్'లో ఆనంద్‌ను గుకేశ్ అధిగమించాడు. అయితే ఇప్పుడు 'ఫిడే' ర్యాంకింగ్ ద్వారా అధికారికంగా ఆమోద ముద్ర వేసింది. టాప్–30 ర్యాంకింగ్స్‌లో వీరిద్దరితో పాటు భారత్ నుంచి ఆర్. ప్రజ్ఞానంద (19), విదిత్ గుజరాతీ (27), అర్జున్ ఎరిగైశి (29) ఉండగా, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సీనియర్ గ్రాండ్‌మాస్టర్ పెంటేల హరికృష్ణ 31వ స్థానంలో కొనసాగుతున్నాడు. 12 ఏళ్ల 7 నెలల 17 రోజుల గ్రాండ్‌మాస్టర్‌గా మారిన గుకేశ్ అతి పిన్న వయసులో ఈ ఘనత సాధించిన ఆటగాళ్ల జాబితాలో మూడో స్థానంలో ఉన్నాడు.

అల్‌కరాజ్, మెద్వెదెవ్ ముందంజ

- ఓటమితో జాన్ ఇస్నర్ రిటైర్
- యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్

న్యూయార్క్: యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో వరల్డ్ నంబర్‌వన్ కార్లోస్ అల్‌కరాజ్ (స్పెయిన్)కు రెండో రౌండ్‌లో సునాయాస విజయం దక్కింది. ఈ మ్యాచ్‌లో టాప్ సీడ్ అల్‌కరాజ్ 6–3, 6–1, 7–6 (7/4)తో లాయిడ్ హారిస్ (దక్షిణాఫ్రికా)ను ఓడించి మూడో రౌండ్‌లోకి అడుగు పెట్టాడు. మూడో సీడ్ డానిల్ మెద్వెదెవ్ (రష్యా) రెండో రౌండ్‌లో 6–2, 6–2, 6–7 (6/8), 6–2తో క్రిస్టోఫర్ కానెల్ (ఆస్ట్రేలియా)పై విజయం సాధించాడు. మూడు గ్రాండ్‌స్లామ్‌ల విజేత ఆండీ ముర్రే (బ్రిటన్) ఆట మాత్రం రెండో రౌండ్‌లోనే ముగిసింది. గ్రిగర్ దిమిత్రోవ్ (బల్గేరియా) 6–3, 6–4, 6–1తో ముర్రేను ఇంటి ముఖం పట్టించాడు. మహిళల సింగిల్స్‌లో రెండో సీడ్ సబలెంకా (రష్యా) 6–3, 6–2తో జోడీ బురెజ్ (యూకే)ను...9వ సీడ్ వొంద్రుసోవా (చెక్ రిపబ్లిక్) 6–2, 6–2తో ట్రెవిజాన్ (ఇటలీ)ను ఓడించి మూడో రౌండ్‌లోకి ప్రవేశించారు.

టెన్నిస్ సర్క్యూట్‌లో సుదీర్ఘ మ్యాచ్‌లకు చిరునామాగా నిలిచిన జాన్ ఇస్నర్ (అమెరికా) రెండో రౌండ్‌లో మరో సుదీర్ఘ సమరంలో ఓడి ఆటకు రిటైర్మెంట్ ప్రకటించాడు. 3 గంటల 57 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్‌లో అమెరికాకే చెందిన మైకేల్ మో 3–6, 4–6, 7–6 (7/3), 6–4, 7–6 (10/7) స్కోరుతో ఇస్నర్‌ను ఓడించాడు. టెన్నిస్ చరిత్రలో సుదీర్ఘ మ్యాచ్ (11 గంటల 5 నిమిషాల పాటు – నికోలస్ మహుత్‌తో) ఆడిన రికార్డులో ఇస్నర్ భాగం కాగా...అత్యధిక ఏస్‌లు (14,470) కొట్టిన ఘనత కూడా అతని సొంతం. **పురుషుల డబుల్స్‌లో ఇద్దరు భారత ఆటగాళ్ల పోరు తొలి రౌండ్‌లోనే ముగిసింది. యూకీ బాంబ్రీ (భారత్) – డెమోలినర్ (బ్రెజిల్) జోడి 3–6, 5–7తో హ్యూగో నిస్ (మొనాకో) – జిలిన్‌స్కీ (పోలాండ్) చేతిలో... సాకేత్ మైనేని (భారత్) – కరట్‌సెవ్ (రష్యా) ద్వయం 7–6 (7/4), 3–6, 2–6తో లాస్లో జెరె (సెర్బియా) – హ్యూస్టర్ (స్విట్జర్లాండ్) చేతిలో ఓడారు.**


కుమారుడితో ఇస్నర్